## క్లుప్తంగా

### మధురస్మృతిగా స్వాతంత్య్ర సంస్మరణ స్థూపం



గంగవరంలో నిర్మించిన స్వాతంత్య్ర సంస్మరణ స్థూపం

బెళుగుప్ప: గంగవరానికి చెందిన కృష్ణమూర్తిరావు స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్నారు. 1947 చిహ్నంగా గంగవరం గ్రామ నడిబొడ్డున స్వాతంత్య్ర సం స్మరణ స్థూపాన్ని అప్పటి గ్రామపెద్దలు లిం గప్ప, శ్రీనివాసులు, శ్రీశైలప్ప మరికొందరు గ్రామస్తులతో కలిసి కృష్ణమూర్తిరావు నిర్మించా రు. దానికి జెండాకట్టగా నామకరణం చేశారు.

### నాటి అపురూప చిత్రం



రాయదుర్గంలో 1947 ఆగస్టు 8న నిర్వహించిన అన్నదాన కార్యక్రమం

రాయదుర్గంటౌన్: 1947 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలో స్వాతంత్య్రం సిద్ధించిన మూడో రోజు అంటే 18-08-1947న రాణీఛత్రంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. తోట అంజినప్ప అండ్ సన్స్ ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదానం చేశారు. అన్నదానం జరిపిన రాణిఛత్రం నేటికీ దేవదాయశాఖ ఆధీనంలో ఉంది.

### అధ్వానం.. మధ్యాహ్న భోజనం



భోజనాన్ని పడేస్తున్న విద్యార్థులు

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉడికీ ఉడకని భోజనం వడ్డించడంతో తినలేక పడేశారు. పాఠశాలలో 334 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం సరిగా ఉడకని భోజనాన్ని అందించడంతో తినలేక పడేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చివేయడంతో నాణ్యతకు పాతర వేశారు. ఒక్కోరోజు కూర బాగుండదు. మరోరోజు భోజనం సరిగా ఉడకదు. కొందరు విద్యార్థులు ఇళ్ల నుంచి అన్నం తెచ్చుకుంటున్నారు. మరికొందరు తినలేక పస్తులు ఉండాల్సి వస్తోంది. ఈ విషయంపై ఇంచార్జ్ హెచ్ఎం శ్రీనివాసులను అడగ్గా పలు మార్లు ఏజెన్సీ నిర్వాహకులకు తెలియచేసినా, వారిలో మార్పురాలేదని తెలిపారు.

### మాన్యువల్‌గా డిగ్రీ ప్రవేశాలు నిర్వహించండి

కళ్యాణదుర్గం: ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలను కౌన్సెలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మితను కలిసి వినతిప త్రం అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, జిల్లా కమిటీ సభ్యుడు అరవింద్, నాయకు లు ధనుష్, ఆదర్శ్, గణేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

### టమాట పంట పరిశీలన



టమాట పంటను పరిశీలిస్తున్న వీఏఏ నగేష్

కూడేరు: కమ్మూరులో ఎంపీఈఓ జాస్మిన్, వీఏఏ నాగేష్ పలువురి రైతులకు చెందిన టమాట పంటను ఉద్యాన అధికారులు బుధవారం పరిశీలించారు. టమాట పంటలో తెగుళ్లపై ఈనెల 11న 'టమాట పంట.. తెగుళ్లతో తంటా' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఉద్యాన అధికారులు స్పందించారు. బూడిద తెగులు నివారణకు లీటరు నీటిలోకి 0.5 గ్రాముల నెటావో మందును కలిపి పిచికారీ చేయాలని, ఆకు ముడత నివారణకు లీటర్ నీటిలోకి వేపనూనె (1000 పీపీఎం) 2ఎంఎల్ లేదా లీటర్ నీటిలో ఫ్రైడ్ 0.5 గ్రా లేదా ఇమిడా క్లోప్రైడ్‌ను లీటర్ నీటిలోకి 0.3 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులుకు లీటరు నీటిలోకి సీఓసీ (కాపర్ యాసర్‌క్లోరిన్) 3 గ్రాములు లేదా క్లోరోథయోనిల్ ఒక లీటర్ నీటిలోకి ఒక ఎంఎల్ కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లు తగ్గిపోతుందని రైతులకు సూచించారు.

### సకాలంలో టీకా వేయండి

బొమ్మనహాళ్: చిన్నారులకు ఇమ్యునైజేషన్ టీకాలు సకాలంలో వేయాలని జిల్లా వైద్యశాఖ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగేంధర్ తెలిపారు. బుధవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో జిల్లా వైద్యశాఖ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగేంధర్ సందర్శించారు. గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంసీహెచ్ కార్డులను పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చిన్నారులకు టీకా వేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడుప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యుగంధర్, హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన తదితరులు పాల్గొన్నారు.

# త్యాగధనులు..

- స్వాతంత్య్ర ఉద్యమంలో పాలుపంచుకున్న ఉరవకొండ వాసులు
- బ్రిటిష్ వారితో పోరాడి జైలు జీవితం గడిపిన మహనీయులు



గాంధీజీ సమావేశం ఏర్పాటు చేసిన ప్రదేశంలో జ్ఞాపకంగా ఏర్పాటు చేసిన మహాత్ముడి విగ్రహం



గాంధీజీ పిలుపు మేరకు పాదయాత్రగా ఉరవకొండ నుంచి ఉద్యమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఉద్యమకారులు (ఫైల్)

ఉరవకొండ: విదేశీయుల కంబంధ హస్తాల నుంచి భరతమాతకు స్వేచ్ఛను కల్పించేందుకు వారు చేసిన పోరాటాలు వెలకట్టలేనివి. తనువంతా దేశభక్తి నింపుకొని స్వాతంత్య్ర పోరాటం చేస్తున్న రోజులవి. నెత్తురు చిందకుండా అహింసే ఆయుధంగా సహాయ నిరాకరణ, హర్తాళ్లు, సత్యాగ్రహాలతో బ్రిటిష్ పాలకులను ముప్పుతిప్పలు పెట్టిన మన ఉద్యమ నేతల బాటలో ఉరవకొండ నుంచి ఎంతో మంది పాదం కలిపారు. స్వాతంత్య్ర సంగ్రామంలో సమరయోధుల్లో స్ఫూర్తి రగిలించి, స్వేచ్ఛ కావాలనే సదాశయంతో నిలిచిన దేశ భక్తులకు చిరునామాగా ఉరవకొండ నిలుస్తోంది.

**గాంధీజీ నడియాడిన నేల:**
స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి విరాళాల సేకరణ, సేవాదళ్ కార్యక్రమాల కోసం 1921- 28 ప్రాంతాల్లో ఉరవకొండకు మహాత్మాగాంధీ సందర్శించారు. స్థానిక పాత గాంధీబజారులో నేటికీ గాంధీజీ నడియాడిన ప్రాంతానికి చిహ్నంగా శిలాఫలకం ఏర్పాటు చేసి, అక్కడే ఒక గాంధీ విగ్రహన్ని ఏర్పాటు చేశారు.

**స్వాతంత్య్ర ఉద్యమంలో పోరాడిన యోధులు:**
దేశం కోసం ఏడాది పాటు జైలు జీవితం: ఉరవకొండకు చెందిన ఎంసీ నరసింహులు 1942 జరిగిన క్విటా ఇండియా ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ వారి చేత అరెస్టు కాబడ్డారు. దీంతో గుత్తి, బళ్లారి ప్రాంతాలలోని సబ్ జైలులో ఏడాది పాటు జైలు జీవితం గడిపారు. 1972లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా తామ్ర పత్రంతో పాటు పింఛన్ అందుకున్నారు.



ఉరవకొండలో గాంధీ ఏర్పాటు చేసిన సమావేశానికి గుర్తుగా శిలాఫలకం

**ఉప్పు సత్యాగ్రహంలో కదం తొక్కిన మాఘం సుబ్బరాయుడు:**
ఉరవకొండ పట్టణంలోని పాత పేటకు చెందిన మాఘం సుబ్బరాయుడు చిన్న వయస్సులోనే గొప్ప దేశ భక్తుడు. 1941 మహాత్మా గాంధీ పిలుపును అందుకొని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. 1942లో క్వింటా ఇండియా ఉద్యమంలో పాల్గొని, గుత్తి సబ్ జైలులో ఆరు నెలల పాటు జైలు జీవితం గడిపాడు. స్వాతంత్య్ర సమరమోధురాలు సరోజినీదేవి తాను రాసిన హహా ఇన్ హహా అనే పుస్తకం మొదటి పేజీలో మాఘం సుబ్బరాయుడు పోరాట పటిమపై ప్రస్తావించారు. సుబ్బరాయుడుకు 1985లో కేంద్రం పింఛన్ మంజూరు చేసింది.


**లాఠీ దెబ్బలు తిన్న ఉప్పర గోవిందప్ప:**
స్వాతంత్య్ర ఉద్యమంలో ఉరవకొండకు చెందిన ఉప్పర గోవిందప్ప బ్రిటిష్ వారి చేతిలో లాఠీ దెబ్బలు తిన్నారు. ఉరవకొండ నుంచి మహాత్మా గాంధీ పిలుపు మేరకు తన సహచర ఉద్యమకారులతో పాదయాత్రకు వెళ్తున్న సమయంలో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి లాఠీ దెబ్బలు తిని జైలు జీవితం కుడా గడిపాడు.

# దుర్గం సమరయోధులు

- ఫ్రీడమ్ ఫైటర్ గురుమాల్ నాగభూషణం పేరిట ప్రత్యేక తపాలా కవరు
- ఉడేగోళంలో సమరయోధుల పోరాట స్మృతి చిహ్నం



తొలి ఎమ్మెల్యే దివంగత గురుమాల్ నాగభూషణం



దివంగత దామోధరసింగ్



దివంగత సత్యభామాదేవి

రాయదుర్గంటౌన్: గాంధీజీ నాయకత్వంలో భారత స్వాతంత్య్ర సవురంలో రాయదుర్గం ప్రాంతం తన వంతు భూమికను పోషించింది. రాయదుర్గం ప్రముఖ గాంధేయవాది, న్యాయవాది, తొలి ఎమ్మెల్యే గురుమాల్ నాగభూషణం 1941లో స్వాతంత్య్ర పోరాటంలో అరెస్ట్ అయి 1941 మే 12 నుంచి బిజాపూర్ జిల్లా ఇండాలిగి సెంట్రల్ జైల్ 3 నెలలు పాటు కారాగార శిక్ష అనుభవించారు. 1952లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో రాయదుర్గానికి చెందిన వరదా చెన్నప్ప, తిప్పయ్య అనే స్వాతంత్య్ర యోధులు 1930 అక్టోబర్ 5 నుంచి 3 నెలల కఠిన కారాగార శిక్షను ఇప్పటి కర్ణాటకలోని కార్వారులో ఉన్న చెరసాలలో అనుభవించారు. రాయదుర్గానికి చెందిన వైహెచ్ సత్యభామాదేవి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు చికాకోల్ కారాగారంలో రెండు నెలలు జైలు శిక్ష అనుభవించారు. రాయదుర్గానికి చెందిన ఆర్.నాగన్నగౌడ్ 1940-41 కాలంలో వ్యక్తిగత సత్యాగ్రహం చేసి అరెస్ట్ అయి రూ.400 దండన చెల్లించి తిరుచానపల్లి (తమిళనాడు) జైలులో ఏడాది కారాగార శిక్ష అనుభవించారు. ఈయన తర్వాత కాలంలో హొస్పేట్(బళ్లారి జిల్లా)లో స్థిరపడి కర్ణాటక ప్రభుత్వంలో మంత్రి పదవులు అనుభవించారు. ఓబుళాచార్యులు, కెరె శరణప్ప, ఎన్‌సీ శేషాద్రి, జగన్‌నాథ్‌సింగ్, నిప్పాణి రంగరావు, వైహెచ్ సుబ్బారావు, సత్యభామాదేవి దంపతులు, మోపూరు చంద్రకాంతనాయుడు, రాయదుర్గం దగ్గర ఉన్న శిరిగేదొడ్డి గ్రావుస్తులైన దామోదర సింగ్, నాగిరెడ్డిపల్లి గ్రావునికి చెందిన కట్టరావుప్ప ఇలా ఎంతో వుంది దేశభక్తులు, స్వాతంత్య్ర యోధులు భారత స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొని రాయదుర్గం ప్రాంత కీర్తి ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. ఓబుళాచార్యులు రాయదుర్గం రాజకీయాల్లో బసవనగౌడు, చిందనూరు నాగప్ప శెట్టి, ఇతర ప్రవుఖులతో పాల్గొని, సేవలందించారు. వీరి జ్ఞాపకార్థం రాయదుర్గం పట్టణంలోని ఒక రోడ్డుకు ఓబుళాచారి రోడ్డు అని నామకరణం చేశారు.



డిసెంబర్ 21, 2021లో విడుదల చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు గురుమాల్ నాగభూషణం పేరిట ప్రత్యేక తపాలా కవరు

**74 ఉడేగోళంలో స్మృతి చిహ్నం:**
రాయదుర్గం మండలం 74 ఉడేగోళంలో గాంధీజీ పిలుపు మేరకు దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో నియోజకవర్గం నుంచి అనేక మంది సమరయోధులు పాలుపంచుకుని పోరాటం చేశారు. సమరయోధుల పోరాటానికి గుర్తుగా స్వాతంత్య్రం సిద్ధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1972-73 మధ్యకాలంలో భారత ప్రభుత్వం పంచాయతీ సమితి ఆధ్వర్యంలో స్మారక చిహ్నం ఏర్పాటు చేశారు. అందులో స్వాతంత్య్ర సమరయోధులు ఎం.వీరయ్య, వైహెచ్ సుబ్బారావు, సత్యభామదేవి పేర్లను ముద్రించారు. వారి త్యాగాలు, దేశభక్తి యువతరానికి ఆదర్శంగా నేటికీ స్మృతి చిహ్నం దర్శనమిస్తోంది.



నియోజకవర్గ సమరయోధుల పోరాటానికి గుర్తుగా 1972-73లో ఉడేగోళంలో ఏర్పాటు చేసిన స్మారక చిహ్నం

### నాగభూషణం సేవలకు గుర్తింపుగా ప్రత్యేక తపాలా కవరు

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 2021 డిసెంబర్ 21న భారత తపాలా శాఖచే స్వాతంత్య్ర సమరయోధుడు, ప్రముఖ గాంధేయవాది, న్యాయవాది, రాయదుర్గం తొలి ఎమ్మెల్యే గురుమాల్ నాగభూషణం పేరిట ప్రత్యేక తపాలా కవర్‌ను అనంతపురంలో విడుదల చేశారు. ఇది రాయదుర్గానికి ఎంతో గర్వకారణం. 1941లో స్వాతంత్య్ర పోరాటంలో అరెస్ట్ అయి 1941 మే 12 నుంచి బిజాపూర్ జిల్లా ఇండాలిగి సెంట్రల్ జైల్ 3 నెలలు పాటు కారాగార శిక్షను అనుభవించారు. 1952లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1953లో శాసనసభ తాత్కాలిక స్పీకర్‌గా పనిచేశారు.

## నిశితంగా పరిశీలించాకే 22ఏ జాబితా సవరణ




మాట్లాడుతున్న ఆర్డీఓ రాణిసుస్మిత

రాయదుర్గం(డి హీరేహాళ్): పేదలకు 1954వ సంవత్సరానికి ముందు ఇచ్చిన (అసైన్డ్) భూములను నిశితంగా పరిశీలించిన తర్వాతనే 22(ఏ) జాబితా నుంచి సవరించే అవకావం ఉంటుందని డివిజన్ ఆర్డీఓ రాణీసుస్మిత అన్నారు. డి హీరేహాళ్ మండలంలోని కాదలూరు, పులకుర్తి, హిర్దేహాళ్ గ్రామాల్లో కొందరు 22ఏ జాబితా నుంచి నిషేధించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ అనిల్‌కుమార్, డీటీ బసవకూమార్, ఆర్ఐ రామాంజనేయులుతో కలిసి ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మురడి గ్రామంలో పర్యటించారు. 4.16 ఎకరాల్లో భూమార్పిడి (కన్వర్షన్) కోసం దరఖాస్తు చేసిన భూమిని పరిశీలించారు. ఆర్డీఓ విలేకరులతో మాట్లాడుతూ త్వరలో రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుడుతామన్నారు. భూ సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కార్యాలయంలో వివిధ శాఖలు ఏర్పాటు చేయడంతో అందుకు ఐఎస్ఓ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అభినందిస్తూ ధ్రువపత్రాన్ని అందజేశారని గుర్తుచేశారు. స్వంత్ర వేడుకల్లో ఐఎస్ఓ ధ్రువపత్రాన్ని అందుకోనున్నట్లు తెలిపారు.

**బీటీపీ లేఔట్‌లో విచారణకు కమిటీ ..**
బీటీపీ లేఔట్‌లో చోటు చేసుకున్న పలు అక్రమాలను నిగ్గు తేల్చేందుకు త్వరలో ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని ఆర్డీఓ రాణిసుస్మిత తెలిపారు. ఓపెన్ సైట్ దురాక్రమణలతో పాటు విలాసవంతమైన బేసిమట్టాలను గుర్తించి, స్వాధీనం చేసుకుంటామన్నారు. అక్రమాల వెనుక ఎవరు దాగి ఉన్నా వదిలిపెట్టేది లేదన్నారు.

## నిధులు లేకుండా వేడుకలు ఎలా నిర్వహించాలి?



మాట్లాడుతున్న ఎంపీపీ రమావత్‌దేవి

వజ్రకరూరు: స్వాతంత్య్ర వేడుకలకు నిధులు కేటాయిస్తూ జీవో ఇచ్చినా, రూపాయి కూడా మంజూరు కాలేదని, డబ్బులు లేకుండా వేడుకలు ఎలా నిర్వహించాలని సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ రమావత్‌దేవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచులు మాట్లాడుతూ స్వాతంత్య్ర వేడకలను ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం చిన్న పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేలు మంజూరు చేస్తూ, జీవో ఇచ్చినా రూపాయి కూడా మంజూరుకాలేదన్నారు. ఈఓఆర్డీ సదాశివ మాట్లాడుతూ జనరల్ ఫండ్‌లో నిధులు వినియోగించుకోవాలని ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. సర్పంచులు మాట్లాడుతూ సీసీ రోడ్ల పనులకు తీర్మానాలు లేకుండా ప్రతిపాదనలు ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. ఎంపీటీసీలు పలు సమస్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి పలుశాఖల అధికారులు గైర్హాజరు కావడంతో అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకమ్మ, మండల సర్పంచుల పోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలలిత, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**ముగిసిన సర్పంచుల శిక్షణ**
బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షకీలాబేగం అధ్యక్షతన మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈఓపీఆర్డీ దాస్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: పంచాయతీల అభివృద్ధిపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీ దాసానాయక్ ఈఓఆర్డీ వెంకట్‌నాయుడులు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఏఓ నందకిశోర్, టీఓటీ రవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే ముందస్తు ప్రణాళిక తప్పనిసరి అని ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ బుధవారం ముగిసింది. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

బెళుగుప్ప: గ్రామాల్లో సమన్వయంతో గ్రామాలను అభివృద్ధిచేసుకుందామని ఎంపీడీఓ రామచంద్ర, ఈఓఆర్డీ మాధవరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, స్వచ్ఛభారత్ క్లాప్ మిత్రలకు ఇచ్చిన శిక్షణ బుధవారం ముగిసింది.

**సంపద సృష్టిపై దృష్టిసారించండి**
కణేకల్లు: గ్రామ పంచాయతీల్లో సంపద సృష్టిపై దృష్టి సారించాలని ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గూడెన్న పాల్గొన్నారు.

**ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం**
కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని బోరంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 20 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. 10 నుంచి ఇంటర్, డిగ్రీ, పిజీ, పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు.సెల్: 9010965230, 9440716015లో సంప్రదించాలన్నారు.

**పాలిటెక్నిక్ కళాశాలలో రెండు నూతన కోర్సులు**
కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా రెండు కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ బుధవారంతెలిపారు. ఈనెల 24 నుంచి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సు, రెవిట్ ఆర్కిటెక్చర్ కో ర్సు ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. సెల్: 8309035309, 8106107723 లో సంప్రదించాలన్నారు.

**విరాళాల సేకరణ**
కణేకల్లు: మండల కేంద్రంలో వయనాడ్ వరద బాధితుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం విరాళాలను సేకరించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, కణేకల్లుశాఖ కార్యదర్శి నాగరాజు తదితరులు దుకాణాలతోపాటు వివిధ కాలనీల్లో విరాళాలు సేకరించారు. వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు మానవత్వంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఓబులు కోరారు.

**చౌక బియ్యం పట్టివేత**
రాయదుర్గం(డి హీరేహాళ్): ప్రభుత్వ చౌక బియ్యం అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తూ మడెనహళ్లి, బొమ్మదేవరపల్లి గ్రామాలకు చెందిన ఓబన్న, సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు బుధవారం పట్టుబడ్డారని డీ హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారు మండలంలోని సోములాపురం, చెర్లోపల్లి, నాగలాపురం గ్రామాల్లో ఇంటింటా బియ్యం కొనుగోలు చేసి లగేజీ వాహనంలో కర్ణాటక రాష్ట్రం చెళ్లకెరకు తరలిస్తూ కొంత కాలంగా సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. కర్ణాటక సరిహద్దు దాటుతుండగా వాహనం పట్టుబడిందన్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

**1000 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ**
రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో అజాదీ కా అమృత్ మహోత్సవం..హర్ ఘర్ తిరంగాలో భాగంగా 1000 అడుగుల భారీ మువ్వన్నెల జెండాతో 3 వేల మంది విద్యార్థినులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగిశివ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పట్టణంలోని హైస్కూల్, కళాశాల విద్యార్థినులతో ర్యాలీ చేశారు.

**గంజికుంట మాజీ సర్పంచు మృతి**
వజ్రకరూరు: మండలంలోని గంజికుంటకు చెందిన మాజీ సర్పంచు కురుబ లింగన్న (61) అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి గంజికుంట గ్రామానికి చేరుకొని కురుబ లింగన్న మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచు జయేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**సబ్సిడీతో డ్రిప్ పరికరాలు**
విడపనకల్లు: ఐదెకరాలు లోపు ఉన్న ప్రతి రైతుకూ తొంబైశాతం డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందిస్తున్నట్లు ఏఓ పెన్నయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో చిన్న సన్నకారు రైతులతో సమావేశం నిర్వహించారు. 2024-25 ఖరీఫ్‌కు సంబంధించి ప్రతి రైతూ కూడా ఈక్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ పెన్నయ్య రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీఈఓ అబ్దుల్ కరీం, శివలత, రైతులు పాల్గొన్నారు.

**గుజరీ వ్యాపారి మృతి**
కూడేరు: అనంతపురానికి చెందిన గుజరీ వ్యాపారి భాస్కర్ (48) గుండె పోటుతో బుధవారం మృతి చెందాడు. వివరాలు.. గుజరీ వ్యాపారి భాస్కర్ కూడేరులోని పీర్లచావిడి కట్ట వద్ద మంగళవారం రాత్రికి అక్కడే నిద్రించాడు. స్థానికులు బుధవారం ఉదయం పలకరించినా చలనం లేకపోవడంతో 108, పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అతను మృతిచెందాడు. పోలీసులు అతన్ని లైసెన్స్ కార్డు ఆధారంగా నంద్యాల జిల్లా డోన్ దగ్గర దొరపల్లి వ్యక్తి అని, కొన్నేళ్లుగా నగరంలో ఉంటున్నట్లు గుర్తించారు.

**ఏపీవీబీఎస్ ఉరవకొండ ఉపాధ్యక్షుడిగా నరేష్**
కూడేరు: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఉరవకొండ మండల ఉపాధ్యక్షుడిగా ఉదిరిపికొండకు చెందిన బోయ నరేష్ (వైఎస్సార్ సీపీ నేత) నియమితులయ్యారు. ఈ విషయాన్ని బుధవారం నరేష్ విలేకరులకు తెలిపారు. తనను ఎంపిక చేసినందుకు సంఘం జిల్లా నేతలకు కృతజ్ఞతలు తెలిపాడు.

**అప్రమత్తత అవసరం**
కంబదూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయుర్వేదిక వైద్యాధికారి రాధాకుమారి సూచించారు. బుధవారం మండలంలోని అండేపల్లి గ్రామంలో ఆయుర్వేదిక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

# తప్పకుంటూరా.. తప్పించమంటూరా!

- చౌకడిపో డీలర్లపై ఒత్తిళ్లు
- కుంటిసాకుతో ఇష్టారాజ్యంగా తొలగింపు
- వేధింపులతో స్వచ్ఛందంగా కొందరు రాజీనామా
- న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న శాశ్వత దుకాణదారులు



గుమ్మఘట్ట మండలం బేలోడులో చౌక దుకాణంపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న డీఎస్ఓ శోభారాణి

రాయదుర్గం: జిల్లాలో రేషన్ డీలర్లపై అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు అధికమయ్యాయి. ప్రభుత్వం మాది.. ప్రభుత్వ చౌకదుకాణాలు మావేనన్నట్లు ఇష్టారాజ్యంగా లాక్కుంటున్నారు. తప్పుకుంటారా? లేక తప్పించమంటారా? అంటూ అధికారులను ఉసిగొల్పి భయంభ్రాంతులకు గురిచేస్తున్నారు. మాటవింటే సరి.. లేదంటే నిర్దాక్షణంగా అక్రమ కేసులు బనాయిస్తూ బయటకు నెట్టేస్తున్నారు.

- డి హీరేహాళ్ మండలంలోని ఓ అధికారి ఊరూర తిరిగి డీలర్లతో బలవంతంగా రాజీనామా చేయించారు. ఎదురుతిరిగితే 6ఏ కేసులు నమోదు చేసి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బఫర్ ఎక్కువ చూపాల్సి వస్తోందని బెదిరింపులకు దిగారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడు ఒకరు ఇది సరైన పద్ధతి కాదని ప్రశ్నించారు. దీంతో సామరస్యంగా తొలగింపు ప్రక్రియ ముగించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఇదే విధానం కొనసాగించారు.

**న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న డీలర్లు**
ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా డీలర్‌గా ఎంపికై గత 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల ఏ చిన్న అవినీతి మరక లేకుండా దుకాణం నడిపిన శాశ్వత డీలర్లు రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేక న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఏ తప్పులేకున్నా లోపాలను వెతికేందుకే జిల్లా స్థాయి అధికారులను ఉసిగొల్పుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బేలోడులో డీఎస్ఓ పర్యటన..**
గుమ్మఘట్ట మండలం బేలోడులో జయరామిరెడ్డి చౌక దుకాణాన్ని స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులు, సీఎస్‌డీటీ సుదర్శనాచారితో కలిసి బుధవారం జిల్లా సివిల్ సప్లై (డీఎస్ఓ) అధికారి శోభారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2014-19 మధ్యలో టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా చౌకదుకాణాలకు కోతపెట్టారు. దీంతో జయరామిరెడ్డితో పాటు మండలంలోని మరో ఆరుగురు డీలర్లు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టులో జయరామిరెడ్డి కేసు విచారణకు వచ్చింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎస్ఓ పది రోజుల వ్యవధిలోనే రెండు సార్లు బేలోడును సందర్శించింది. స్థానిక పీర్ల చావిడి వద్ద ప్రజాభిప్రాయం సేకరించుకుంది. ఆ నివేదికను జిల్లా కలెక్టర్, హైకోర్టుకు సమర్పించనున్నారు. ఇలా పర్మినెంట్ దుకాణాలు తొలగిస్తే న్యాయస్థానం ముందు తల వంచాల్సి వస్తోందని తొలగించబడిన డీలర్లు వాపోతున్నారు.

### అన్యాయం చేయాలని చూస్తున్నారు

ఎన్నో ఎళ్లుగా ఏ చిన్న మచ్చా లేకుండా రేషన్ దుకాణం నిర్వహిస్తున్నాను 2014 లో నిర్దాక్షిణంగా నాదుకాణం తొలగించారు. దీంతో హైకోర్టును ఆశ్రయించాను. ఐదేళ్ల తర్వాత విచారణకు వచ్చింది. డీలర్ షిప్ ఇచ్చే ఇష్టం లేక వరుసగా జిల్లా స్థాయి అధికారితో రెండు సార్లు విస్తృతంగా తనిఖీలు, ప్రజాభిప్రాయ సేకరణ జరిపించారు.

– జయరామిరెడ్డి, డీలర్ బేలోడు

### ఒత్తిళ్లు అధికమయ్యాయి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీలర్లపై అధికారులను ఉసిగొల్పి ఒత్తిడి తీసుకొచ్చారు. రాజీనామా చేయాలని వెంటపడి సంతకాలు తీసుకున్నారు. కనీసం ఒక నెల సమయం ఇవ్వాలని వేడుకున్నా చాలా చోట్ల పట్టించుకోలేదు. డీలర్లకు రాజకీయాలు అంటకట్టే విధానం మంచిది కాదు.

– ఎం.శ్రీనివాసులు, డీలర్, రాయదుర్గం

## దంచికొట్టిన వర్షం



కణేకల్లు-మాల్యం మార్గమధ్యంలో రోడ్డు కొట్టుకుపోవడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో బుధవారం తెల్లవారు జామున 3.30 గంటలకు ప్రారంభమైన వర్షం.. ఏకదాటిగా 5.30 గంటల వరకు కురిసింది. కొలిమివీధి, రామస్వామీధి, పాత మీసేవా కేంద్రం ఏరియా, మధు టాకీస్ ఏరియా, వెంకటేశ్వర కాలనీ, మధుటాకీస్ ఏరియా, ముత్తరాసి కాలనీలు ముంపునకు గురై ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని 11వ వార్డులో విద్యుత్ స్తంభం కూలిపోయి ఉపాధ్యాయుడు రామాంజనేయులు ఇంటి ప్రహరీపై పడింది. ఆ సమయంలో కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టింది. 129.02 మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది. ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి.బేలోడు గ్రామంలో భాగ్యమ్మ అనే మహిళా రైతు సాగు చేసిన రెండెకరాల వరి పైరు వర్షపు నీటికి పూర్తిగా దెబ్బతినింది. ఎస్.హొస్లల్లి గ్రామ సమీపంలో రైతులు మల్లికార్జున, కొండారెడ్డి సాగు చేసిన పంట పొలాలు నీటమునిగిపోయాయి.

కణేకల్లు: మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కణేకల్లు మినహా వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కణేకల్లు క్రాస్, ఆలూరు, యర్రగుంట, నల్లంపల్లి, పుల్లంపల్లి, ఆదిగానిపల్లి, పూలచెర్ల, జక్కలవడికి తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి వంకులు, వాగులు పొంగిపొర్లాయి. వరదనీటి ఉధృతికి కణేకల్లు-మాల్యం మార్గమధ్యంలో వేదవతి హగిరి మీదుగా ఉన్న రోడ్డు కొట్టుకుపోయింది.